నగరంలో 'వోల్టా రైడ్' సేవలు

లక్డీకాపూల్: నగరంలో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే క్రమంలో వోల్టా రైడ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు రైడ్ షేరింగ్ స్టార్టప్ వ్యవస్థాపకులు శశికాంత్ కనపర్తి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా, (జీరో పర్సెంట్ కమిషన్) డ్రైవర్లకు తక్షణ చెల్లింపులే లక్ష్యంతో ఈ సేవలను అందించనున్నట్టు చెప్పారు. మార్కెట్‌లోని ఇతర రైడ్ షేరింగ్ సర్వీసుల కంటే భిన్నంగా వోల్టా సంస్థ కస్టమర్లను వారి గమ్య స్థానాలకు చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని... ఇందులో భాగంగా సంప్రదాయ రైడ్ షేరింగ్ సంస్థల నుంచి డ్రైవర్లు తరచు ఎదుర్కొనే అధిక కమిషన్ భారం, ఆలస్యంగా చెల్లించే చెల్లింపుల భారం నుంచి విముక్తి కలిగించామన్నారు. 'రైడ్ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని, తక్కువ ఛార్జీలు చెల్లించేలా మరో రైడ్ కోసం ఎదురు చూసే పనిలేదన్నారు. వోల్టా యాప్‌లో తక్కువ ప్రయాణ ధరల్ని సూచించేలా యాప్‌లో ప్రయాణికులకు సరికొత్త ఫీచర్లను అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా తక్కువ ఛార్జీలను చెల్లించి వారి చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని వోల్టా సీఈఓ రాజా విక్రమ్ తెలిపారు. వోల్టా యాప్ ఐఓఎస్, ఆండ్రాయిడ్ యాప్ స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ డీసీ

ముషీరాబాద్: ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటరు లిస్టులో పేర్ల నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు... ఆయా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక కేంద్రాలను నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తయినా... అంతకంటే ఎక్కువ వయస్సు ఉండే కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 ద్వారా లేదా మొబైల్ యాప్, ఆన్‌లైన్ ద్వారా, సంబంధిత బీఎల్‌వో ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు. తప్పులను సరి చేసుకునేందుకు కేంద్రాలను సంప్రదించి తమ దరఖాస్తులను అందించాలన్నారు. ప్రతి పోలింగ్ లొకేషన్‌లో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లు ఉంటారని వారికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రజల కోసం నిర్వహిస్తున్న ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

చిక్కడపల్లి: ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికై నామినేషన్ వేసిన సందర్భంగా ఆయనకు శుక్రవారం నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కైలాష్‌కుమార్ బెస్త, రాపోలు జయప్రకాష్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగు కోసం ట్రాస్మా కృషి

అంబర్‌పేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రాస్మా) రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన నేతృత్వంలో లోకసత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణను కలిసి విద్యా వ్యవస్థపై తాము చేపట్టే విభిన్న కార్యక్రమాలను వివరించి ఆయనను సహకారం కోరారు. జిల్లా స్థాయిలో ఎడ్యుకేషన్, రిసర్చ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లను ట్రాస్మా ఏర్పాటు చేసి ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత పాఠశాల వరకు బోధించే ఉపాధ్యాయులకు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు శిక్షణ ఇస్తామన్నారు. బడ్జెట్ పాఠశాలల్లో సమర్థులైన విద్యార్థులను తీర్చిదిద్దేలా తమ అసోసియేషన్ పాటు పడుతుందని జయప్రకాశ్‌నారాయణకు వివరించారు. దీనిపై జయప్రకాశ్ స్పందిస్తూ... తమ వద్ద ఉన్న అంశాలను అందించి సహకారం అందిస్తామన్నారు. త్వరలో ట్రాస్మా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాల్సిందిగా జయప్రకాశ్ నారాయణను ఆహ్వానించారు. శివరాత్రి యాదగిరి, రఘువేంద్ర రెడ్డి, ఉమామహేశ్వరరావు, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

చిక్కడపల్లి: వడ్డెరుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వడ్డెరుల దేవం వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం నిర్వహించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ తెలంగాణ కమిటీవారు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్యలు మాట్లాడుతూ... వడ్డెరుల సమస్యలపై త్వరలో అధికారులతో ఓ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఓర్సు కృష్ణయ్య, మక్కల పెంటేష్, శ్రీనివాస్, నారాయణ, ముత్యాలు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

అంబర్‌పేట: అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల కొరడా ఝులిపించారు. అంబర్‌పేట ప్రధాన రోడ్డుకు ప్రత్యామ్నాయ రోడ్లపై ఉన్న అక్రమ పార్కింగ్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబు నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వినాయక నగర్ చౌరస్తా నుంచి రెడ్ బిల్డింగ్ చౌరస్తా వరకు ఇరువైపులా నిలిపిన వాహనాలను తొలిగించారు. అలాగే పటేల్‌నగర్ చౌరస్తాలో ఎంతో కాలంగా సమస్యగా మారిన అక్రమ పార్కింగ్‌పై సహితం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

ముషీరాబాద్: అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకొని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్‌పటాలే, ఆర్.ఆంజనేయులు, మహిళా కమిటీ అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.... రామమందిర నిర్మాణం నేపథ్యంలో ఈ నెల 22 వరకు కాలనీలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ నాయకులు శ్రీనివాస్, కమల్‌కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

చిక్కడపల్లి: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజవర్గంలోని పద్మశాలీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షురాలు బోనం ఉర్మిళ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో పద్మశాలీ మహిళలకు బొట్టుపెట్టి పోటీలకు ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ నెల 21న (ఆదివారం) ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉ 9 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. పద్మశాలీ మహిళలు అధికంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. వివరాలకు నిర్వాహకులు నిర్మల, స్వరూప, గీత, స్వర్ణలతలను ఫోన్: 79894 38283లో సంప్రదించాలని కోరారు.

మున్నూరు కాపులకు అధిక సీట్లు కేటాయించాలి

చిక్కడపల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరు కాపులకు అధిక సీట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం అన్ని పార్టీలకు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో కూడా మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో విద్యార్థుల కోసం బాల, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని జిల్లా నియోజవర్గ మండల కేంద్రాల్లో మున్నూరు కాపులకు భవనాల కోసం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతులకు పెన్షన్, పండించిన పంటకు మద్దతు ధర, ధ్యానం విలువ చేసుకోవడానికి మండల కేంద్రాల్లో గోదాములు, రైతులకు సబ్సిడీ కింద వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం!

- గతంలో కంటే ఎక్కువ ఎంపీ స్థానాలను గెలుస్తాం
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఖాయం
- తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కోల్పోయింది
- భవిష్యత్ బీజేపీదే: రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


శివాజీ చౌక్‌లో వాల్‌రైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కేంద్రంలో బీజేపీ 3వ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని, గతంలో గెలిచిన 303 లోక్‌సభ స్థానాలకంటే ఎక్కువ స్థానాలలో గెలవడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మరోసారి మోదీ ప్రభుత్వం అంటూ కవాడిగూడ డివిజన్‌లోని శివాజీ చౌక్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వాల్‌రైటింగ్ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వస్తే ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం నిలబడుతుందని స్పష్టం చేశారు.

- గతంలో గెలిచిన 303 పార్లమెంటు స్థానాలకంటే రాబోయే పార్లమెంటుఎన్నికల్లో అధిక స్థానాలు సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలందరూ 3వసారి నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ప్రతిపక్షాలు మాత్రం అయోధ్యలో జరిగే రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని సైతం రాజకీయం చేయడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ ఉంటుందని, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో ఉనికి కోల్పోయిందని, తెలంగాణలో బీజేపీ పార్టీదే భవిష్యత్ అని పేర్కొన్నారు.
- బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సి.మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు గంట శ్రీనివాస్, భువనగిరి శేఖర్, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఎం.సురేష్ ముదిరాజ్, నాయకులు కృష్ణహరి, కుమార్‌గౌడ్, దిలీప్‌యాదవ్, తొలుపునూరి రమేష్‌గౌడ్, ప్రవీణ్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాముడు పుట్టిన ప్రాంతంలోనే రామమందిరం


వీఎస్‌టీలోని వాల్‌పై కమలం గుర్తును చిత్రీకరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాముడు పుట్టిన ప్రాంతంలోనే రామమందిరం నిర్మాణం జరిగిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 22న జరిగే బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనోత్సవానికి కాంగ్రెస్ నేతలు హాజరుకావడం లేదని హిందూ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. శుక్రవారం వీఎస్‌టీ వద్ద మరో సారి మోడీ పేరుతో కమలం గుర్తును వాల్‌పై చిత్రీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. పేదల సంక్షేమం పట్ల చూపుతున్న మక్కువను చూసి బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం జరిగిందన్నారు. దేశంలో అనేక చట్టాలు తీసుకువస్తుంటే కాంగ్రెస్ పార్టీ సహించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ ముషీరాబాద్ కోఆర్డినేటర్ రమేష్‌రామ్, రాంనగర్ డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్, గడ్డం సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామమందిరం.. హిందువులకు గర్వకారణం


బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ

ముషీరాబాద్: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ తదితరులు ఆలయంలో చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందువుల చిరకాల కోరిక నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాలను శుభ్రపరుస్తూ తన భక్తి భావాన్ని చాటుకోవాలని సూచించారు. ఆలయ ప్రారంభోత్సవానికి దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రీనారాయణ, కంచికుమార్, నేతలు రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి


సూచనలిస్తున్న అటల్ టింకర్ ఢిల్లీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ రఫీ

నల్లకుంట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికితీసి, నైపుణ్యాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 700 పాఠశాలలను ఎంపిక చేసి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నల్లకుంట తిలక్‌నగర్‌లోని కేర్ మోడల్ హై స్కూల్‌కు అటల్ టింకర్ ల్యాబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా అటల్ టింకర్ ఢిల్లీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్‌రఫీ, విద్యాశాఖ అధికారి డిప్యూటీ ఐఓఎస్ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం కేర్ మోడల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన అటల్ టింకర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంతో ప్రేరణాత్మక విషయాలపై చర్చించారు. విద్యార్థులు ఒక సమస్యను ఏ విధంగా గుర్తించాలి, దాన్ని ఎలా పరిష్కరించుకోవాలి అనే విషయాలను వివరించారు. సాంకేతిక రంగంలో పిల్లలు సొంత ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు ఎలా చేయాలో వివరించారు. అలా విద్యార్థులను ప్రేరేపించి వాళ్లలోని ప్రతిభను వెలికి తీసుకురావాలని ఉపాధ్యాలకు సూచించారు. కేర్ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ రాంచందర్, ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు శిరీష, నిర్మల, వెన్నెల, ప్రశాంతి, ప్రార్థన, జగదీష్ పాల్గొన్నారు.

వనరుల పరిరక్షణ అందరి బాధ్యత


ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నివేదితకుమార్

కాచిగూడ: సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. ఎ.శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురాలోని తెలంగాణ యువతి మండలి హాల్‌లో పర్యావరణంపై జరిగిన కార్యక్రమంలో ఆయన గెస్ట్ లెక్చరర్‌గా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ... దేశంలో పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా అవి పటిష్టంగా అమలు కావడం లేదన్నారు. సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించాలని, వాటి తరుగుదల మానవ మనుగడకే పెను ముప్పు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భావితరాలకు కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. డాక్టర్ బి.శివప్రసాద్, తెలంగాణ యువతి మండలి కార్యదర్శి నివేదిత కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.పద్మజ మల్లికార్జున్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాలను అలవర్చుకోవాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాలను అలవర్చుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ అన్నారు. శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌యాదవ్ వర్ధంతిని నిర్వహించారు. ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... కార్మికుల హక్కుల సాధన, చట్టాల అమలు కోసం ప్రభాకర్‌యాదవ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.

అధ్వాన రోడ్డుపై బైఠాయించి మాజీ కార్పొరేటర్ నిరసన


గుంతల రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ కార్పొరేటర్ రవీందర్

కవాడిగూడ: అభివృద్ధి కార్యక్రమాల పేరుతో డ్రైనేజీ పైప్‌లైన్‌ల కోసం రోడ్డును తవ్వి పైప్‌లైన్‌లు వేసిన తరువాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడం వల్ల పూర్తిగా గోతులమయంగా మారి ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ ఆరోపించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారుల సమన్వయ లోపంతో ఏడాదిన్నర క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ కోసం దోమలగూడ జేబీ అపార్ట్‌మెంట్ గగన్‌మహల్‌లో రోడ్డును తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ కోసం తవ్విన గగన్‌మహల్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో స్థానికులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జేబీ అపార్ట్‌మెంట్, గగన్‌మహల్‌లో పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డును జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్నవారు ప్రమాదాలకు గురికాకతప్పడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు బస్తీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రవీందర్ హెచ్చరించారు. తాళ్లబస్తీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.శ్రీనివాస్ ముదిరాజ్, బి.శివరాజ్, నాయకులు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, వై.శ్రీనివాస్‌గౌడ్, బి.రమేష్, భరద్వాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. ప్రివెంటివ్ మెడిసిల్ ఫీడర్ పరిధిలో నారాయణగూడ, గౌరమ్మ గల్లి, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీహాల్, సాయిబాబా కమాన్, సుందరయ్య పార్కు తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30, నారాయణగూడ ఫీడర్ పరిధిలో దుర్గా మెస్, హెచ్ఆర్‌డి కాలేజ్, రత్న డిగ్రీ కాలేజ్, రెడ్డి కాలేజ్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30, ఆప్కో ఫీడర్ పరిధిలో నారాయణగూడ వాటర్ వర్క్స్, కెనరాబ్యాంక్, శాంతి థియేటర్, తెలంగాణ టూరిజం, విఠల్ వాడి, తెలుగు అకాడమీ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30, విఠల్‌వాడీ ఫీడర్ పరిధిలో నీలోఫర్ కేఫ్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

మచ్చ ప్రభాకర్ మరణం తీరని లోటు


ప్రభాకర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

కాచిగూడ: పద్మశాలీ కులస్తుల సంక్షేమం.. అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మచ్చ ప్రభాకర్ చిరస్మరణీయులని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో మచ్చ ప్రభాకర్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... మచ్చ ప్రభాకర్ మరణం పద్మశాలీ సమాజానికి తీరని లోటు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అనిల్, పాండురంగయ్య, దుశ్యంతల, రూప, మురళి, భాస్కర్, రామచంద్ర రావు, బొమ్మ రఘురామ్, అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


రామకృష్ణ శర్మ

నల్లకుంట: సినిమా చూసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి ఆదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ కృష్ణ సమాచారం మేరకు... ఎస్వీ హరిహరనాథ్‌శర్మ కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట శివం రోడ్డు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. అవివాహితుడైన ఆయన రెండో సోదరుడు(అన్న) ఎస్వీ రామకృష్ణ శర్మ(44) ఆయనతో పాటు నివాసముంటున్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం సినిమాకు వెళుతున్నానని ఇంట్లో వాళ్లకు చెప్పి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో హరిహర శర్మ తన అన్న కనిపించడం లేదంటూ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 60555లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

'హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకే రామమందిరం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి మెజార్టీ హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకే అయోధ్యలో రామమందిరాన్ని నిర్మిస్తున్నారని తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు నకిరెకంటి చిట్టిబాబు విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్మిక ప్రజా వ్యతిరేకాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అనేక విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో చంద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్, ఏపీ రైతు కూలీ సంఘం నాయకుడు బి.రాజన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు షేక్ షావలీ, మహ్మద్ రషీద్, అఖిల భారత విప్లవ మహిళా సంఘం నాయకురాలు సంపంగి పద్మ, కోలిమి ప్రసాద్, ఎస్.సుధాకర్, భానోత్ సంతోష్‌నాయక్, మీసాల రాము తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌మందిర్‌లో 'స్వచ్ఛ అభియాన్'

కాచిగూడ: అయోధ్య రామ మందిర్‌లో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనోత్సవం నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు కాచిగూడలోని శ్యామ్ మందిర్‌లో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, సి.కృష్ణయాదవ్, జి.కావ్యా కిషన్ రెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్ తదితరులు శ్యామ్‌మందిర్ ప్రాంగణం, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ... రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికంగా ఉండే అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ అభియాన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 22న జరిగే ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా ప్రజలందరూ వీక్షించాలని సూచించారు. ఇళ్లు, ఆలయాలను అలంకరించి దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో నేతలు సుభాష్ పటేల్, ఆనంద్ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, యశ్వంత్, ఎస్ఎస్ రాము, శీర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

కాచిగూడ: ముగ్గులు వేయడం వల్ల పలు లాభాలు ఉన్నాయని అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్‌పర్సన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య జి.కావ్యా కిషన్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మారుతున్న కాలంతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో మార్పులు చేసి చూపిస్తున్నారని అన్నారు. గతంలో మహిళలు ఇంటి ముందు అలుకు పెట్టి ముగ్గులు వేయడం వలన ఆ ప్రాంతం ఎంతో అందంగా కనిపించేదని, ప్రస్తుతం ఆ ముగ్గులు కనుమరుగై పోతున్నాయని అన్నారు. మహిళలు ముగ్గులు నేర్చుకున్నా కూడా ఇలాంటి సందర్భాల్లో మాత్రమే తమకు వచ్చిన రీతిలో ముగ్గులు వేసి ఆకట్టుకుంటున్నారని అన్నారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఏనాడూ మర్చిపోవద్దని సూచించారు. ఏ పోటీల్లోనైనా పట్టుదలతో పాల్గొని విజయం కోసం సాధన చేయాలన్నారు. అవార్డులు ముఖ్యం కాదని, ఆ రంగంలో ప్రతిభను చాటుకోవడమే ప్రధానమన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు, పాల్గొన్న మహిళలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఏబీవీ సెంటర్ కోఆర్డినేటర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి

అంబర్‌పేట: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడుగా అంబర్‌పేటకు చెందిన గంధ మల్ల ఆనంద్‌గౌడ్ నియమితులైన సందర్భంగా ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీసీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో బీసీ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తనన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, సంజయ్, మల్లేశ్, ఈశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

16న పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలి: ఏఐటీయూసీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవనోపాధిపై అనాగరిక దాడులు చేస్తున్నదని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జిల్లా కార్మిక, ఉద్యోగ, కిసాన్ మోర్చా సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక గ్రామీణ బంధును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తు చేసే సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు కమతం యాదగిరి, ఎస్.కుమార్, శివబాబు, కె.శ్రీనివాస్, అరుణ, అనురాధ, ఆంజనేయులు, ఆర్.జనార్ధన్, ప్రవీణ్ తదితరులు ప్రసంగించారు.

విద్యతోనే ఉజ్వల భవిత

ముషీరాబాద్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువుకోవాలని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని మదినాతులుం హై స్కూల్‌లోని టెన్త్ విద్యార్థులకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో మోడల్ పేపర్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు ఎంఐఎం పార్టీ నాయకులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసి ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ గౌసుద్దీన్ తాహా, ముషీరాబాద్ ఐరన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఆదంఆలీ, మహ్మద్ గౌస్, ఎంఐఎం పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జీ యామిన్, పార్టీ నాయకులు షరీఫ్, నూరుద్దీన్, రఫీక్‌పాషా, లయాక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రికి వినతి

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీతో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి సాధ్యమని నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని టీపీసీసీ సెక్రటరీ జి.ఎన్.కేశవ్ అన్నారు. నియోజకవర్గంలోని తొమ్మిది బస్తీల కాలనీల సమస్యలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వివరించి వినతిపత్రం అందజేశారు. జామై ఉస్మానియా బస్తీ తొలగింపు అంశం, విద్యుత్ సమస్యలు, ఆరు పథకాల గురించి వివరించారు. నెలకొన్న ప్రతి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని భట్టి విక్రమార్క తెలిపినట్లు నాయకులు వివరించారు. ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో జై భీమ్ సేనా ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు, బస్తీ అధ్యక్షుడు ఇ.సాయిప్రసాద్, ఎల్లన్న, తాలూకా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలి

కాచిగూడ: గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచి వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని జాతీయ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించినందున వెంటనే కులగణన చేపట్టాలని అన్నారు. కులగణన చేపడితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి బడుగు బలహీన వర్గాలు మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కులగణనతో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కులగణన కేవలం రిజర్వేషన్లు పెంచడానికే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు జరగడానికి, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.సాయికిరణ్, కొండల్, శివ యాదవ్,